ఎపి నిట్ ప్రొఫెసర్‌కు జాతీయస్థాయి అవార్డు

తాడేపల్లిగూడెం: స్థానిక ఎపి నిట్‌లోని మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ రఫీమహ్మద్ పరిశోధనకుగాను డిస్టెంక్షన్ ఇన్ కొరోషన్ సైన్స్ అండ్ టెక్నాలజీ కేటగిరి విభాగంలో జాతీయ అవార్డు లభించింది. ఇటీవల కార్కాన్ పేరుతో ముంబైలో నిర్వహించిన అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ముంబై) వైస్ ఛాన్సలర్ డాక్టర్ పండిట్ నిరుధ్ చేతుల మీదుగా అవార్డును, రూ.25 వేల నగదు ప్రోత్సాహన్ని రఫీ అందుకున్నారు. రఫీ ఇప్పటి వరకు ఇంటర్నేషనల్ జర్నల్స్‌లో 25 కథనాలను ప్రచురించగా, నేషనల్, ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లో 50 పేపర్లను సమర్పించారు. ఈయనను నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రమోద్ పడోలే, రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశోధనలు దేశ అభ్యున్నతికి వెన్నెముకగా నిలుస్తాయని, అటువంటి పరిశోధనా విభాగంలో ఎపి నిట్ ప్రొఫెసర్‌కు రఫీకి జాతీయస్థాయి అవార్డు రావడం ఎంతో గర్వకారణంగా ఉందని అన్నారు.

'చింతలపూడి' పూర్తి చేస్తాం

మామిడి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు చర్యలు
నూజివీడు మున్సిపాల్టీలోని ఒక్కో సచివాలయ పరిధిలో అభివృద్ధికి రూ. కోటి
నూజివీడు సభలో సిఎం జగన్మోహన్‌రెడ్డి
సభకు పెద్దసంఖ్యలో కాలేజీ విద్యార్థుల తరలింపు
పోలీసుల ఆంక్షలతో జనం తీవ్ర ఇబ్బందులు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి/నూజివీడు టౌన్

చింతలపూడి ఎత్తిపోతల పథకంపై తనకు అవగాహన ఉందని, ప్రాధాన్యతా క్రమంలో యుద్ధప్రాతిపదికన ఈ సాగునీటి ప్రాజెక్టును పూర్తి చేస్తామని సిఎం జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కుల కల్పన, లంక భూములకు పట్టాలివ్వడం, చుక్కల భూములు, షరతుల గల పట్టాభూములు, సర్వీస్ ఇనాం భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి హక్కులు కల్పించడం, భూమి కొనుగోలు పథకం కింద ఇచ్చిన భూములపై హక్కుల కల్పన, గిరిజనులకు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాల పంపిణీకి సంబంధించిన కార్యక్రమాన్ని సిఎం నూజివీడులో శుక్రవారం ప్రారంభించారు. 10.45 గంటలకు స్థానికంగా ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు చేరుకున్న సిఎంకు మంత్రులు, ఎంఎల్ఎలు, అధికారులు ఘనస్వాగతం పలికారు. అక్కడ నుంచి రోడ్డుమార్గం గుండా సభాస్థలికి సిఎం చేరుకున్నారు. భూముల రీసర్వేకు సంబంధించి ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సిఎం పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సభా వేదికపైకి చేరుకుని వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. తొలుత కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ స్వాగతోపన్యాసం చేశారు. ఏలూరు జిల్లాలో వ్యవసాయ రంగానికి సహకారం అందిస్తూ, మెడికల్ కాలేజీ స్థాపించిన సిఎం జనాల గుండెల్లో స్థానం సంపాదించారన్నారు. ఏలూరు జిల్లాలో భూమిలేని నిరుపేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ 752 మంది పేదలకు 693.25 ఎకరాల భూపంపిణీ ప్రభుత్వం చేస్తుందన్నారు. జిల్లాలో 13,077 మందికి చెందిన 16,446 ఎకరాలను భూముల రిజిస్ట్రేషన్ చట్టం నిషేధిత జాబితా నుంచి తొలగించడం ద్వారా లబ్ది చేకూరుతుందన్నారు. ఎస్‌సి సామాజిక తరగతికి శ్మశానవాటికల కోసం 31 గ్రామాలకు 33.32 ఎకరాలు ఆయా గ్రామ పంచాయతీలకు అందించామన్నారు. భూరక్ష పథకం ద్వారా జిల్లాలో ఆరు గ్రామాలకు ఆర్ఓఆర్ పూర్తయ్యి.. యాజమాన్య పత్రాల జారీ జరగబోతుందని తెలిపారు.

ఎంఎల్ఎ కోరారు.. సిఎం హామీ ఇచ్చారు

నూజివీడు ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ గతంలో నూజివీడు నియోజకవర్గానికి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారన్నారు. తాగునీరు, ట్రిపుల్ ఐటి ఏర్పాటు, ఎస్‌టిలకు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశారన్నారు. చంద్రబాబు నూజివీడు నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. సిఎం జగన్ ఎన్నో సంక్షేమ పథకాలు పేదలకు అందిస్తున్నారన్నారు. ఈసారి ఎన్నికల్లోనూ జగన్ గెలిచి రెండోసారి సిఎం అవుతారన్నారు. టిడిపికి రెండు సీట్లు రావడం గగనమే అన్నారు. నూజివీడు మున్సిపాల్టీలో అభివృద్ధి లేకుండా పోయిందని, పట్టణంలో 32 వార్డులు ఉన్నాయని, సచివాలయానికి రూ.50 లక్షలు చొప్పున ఇవ్వాలని కోరారు. మామిడి ప్రాసెసింగ్ యూనిట్‌కు సంబంధించి రూ.275 కోట్ల అంచనాలతో రెండో ఫేజ్‌లో ఉందని, దీనికి 26 ఎకరాలు ఇవ్వడం జరిగిందన్నారు. వెంటనే దీనికి అనుమతి ఇవ్వాలని కోరారు. సాగునీటికి అత్యంత అవసరమైన చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలని ఎంఎల్ఎ కోరారు. సిఎం తన ప్రసంగంలో ఎంఎల్ఎ అడిగిన వాటిపై మాట్లాడుతూ నూజివీడు మున్సిపాలిటీ పరిధిలో 16 సచివాలయాలు ఉన్నాయని, ఒక్కో సచివాలయానికి రూ.కోటి చొప్పున నిధులిస్తున్నట్లు ప్రకటించారు. నూజివీడు ప్రాంతంలోని మామిడి రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రూ.275 కోట్లతో మామిడిగుజ్జు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఇప్పటికే సమగ్ర ప్రాజెక్టు నివేదికలను తయారు చేసి బ్యాంకులకు పంపించడం జరిగిందన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామన్నారు. సిఎం తిరిగి వెళ్లేటప్పుడు హెలిప్యాడ్ వద్ద వైసిపి నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తానేటి వనిత, ధర్మాన ప్రసాదరావు, పినిపే విశ్వరూప్, మేరుగ నాగార్జున, ఎంపీలు కోటగిరి శ్రీధర్, మిథున్‌రెడ్డి, జిల్లాలోని ఎంఎల్ఎలు కొఠారు అబ్బాయచౌదరి, ఎలిజా, తెల్లం బాలరాజు, దూలం నాగేశ్వరరావు, పుప్పాల వాసుబాబు, తలారి వెంకట్రావు, జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కాలేజీ విద్యార్థుల తరలింపు

శుక్రవారం నాగులచవితి కావడంతో మహిళలు పెద్దగా సిఎం సభకు రాలేదు. దీంతో స్థానికంగా ఉన్న కాలేజీ విద్యార్థులను పెద్దఎత్తున సిఎం సభకు తరలించారు. వివిధ ప్రాంతాల నుంచి సైతం పెద్దఎత్తున జనాన్ని సభకు తరలించారు. పోలీసుల ఆంక్షలతో జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సిఎం సభ పూర్తయిన తర్వాత కూడా గంటవరకూ ట్రాఫిక్ ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో జనం ఎండకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

స్కూల్లోనే వండించి పెట్టండి

'మధ్యాహ్న భోజనం' తనిఖీలో హెచ్‌ఎంకు డిప్యూటీ సిఎం కొట్టు ఆదేశం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

'స్కూల్లోనే మధ్యాహ్న భోజనం వండించి విద్యార్థులకు పెట్టండి' అని డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ పట్టణంలోని జెడ్‌పి హైస్కూల్ హెచ్‌ఎంను ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్లో శుక్రవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి హాజరైన కొట్టు పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులతో మంత్రి ముచ్చటించారు. మధ్యాహ్నం భోజనం ఎలా ఉంటుంది, మీ ఇంటి వద్ద బాగుందా, ఇక్కడ బాగుందా అని అడిగి తెలుసుకున్నారు. వేరుశెనగ చెక్కీలు ఇవ్వకపోవడం, ఆకుకూర పప్పు బాగా పలచగా ఉండడాన్ని, అన్నం ముతకగా ఉండడాన్ని మంత్రి గుర్తించారు. కోడిగుడ్లు చిన్న సైజులో ఉండడం, కొన్ని అదిలిపోయినట్లు పైకి పొక్కిపోవడాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ స్కూల్లోనే మధ్యాహ్న భోజనం వండి పెట్టాలని గతంలోనే తాను చెప్పానని, ఇంకా ఎందుకు అమలు చేయడం లేదని స్కూల్ హెచ్‌ఎంను ప్రశ్నించారు. ఇప్పటికైనా మధురాన్నంను ఆపి ఇక్కడే వండి పెట్టేలా అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. మెనూ కచ్చితంగా అమలమయ్యేలా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రద్ధ వహించాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్, ఎఎంసి ఛైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్, వైసిపి నేతలు గుండుబోగుల నాగు, కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు ఉన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న కొట్టు

2 గంటలు ఆలస్యం.. 72 అర్జీలు

'జగనన్నకు చెబుదాం'లో వినతులు స్వీకరించిన కలెక్టర్, అధికారులు

వీరవాసరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభమైనా 72 అర్జీలు వచ్చాయి. కలెక్టర్ పి.ప్రశాంతి ఆధ్వర్యాన ఈ కార్యక్రమం సాగింది. ఉదయం పది గంటలకే ప్రారంభం కావాల్సినప్పటికీ మధ్యాహ్నం 12 గంటలకు అధికారులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అప్పటికే కొంతమంది ప్రజాప్రతినిధులు వెనుదిరిగారు. మొత్తం 72 అర్జీలు అందగా వాటిలో కొన్ని ఫిర్యాదులు గతంలో ఇచ్చినవే ఉన్నాయి. గతంలో అర్జీ ఇచ్చినా పరిష్కారం చూపకపోవడంతో ఇప్పుడైనా పరిష్కారమవుతుందనే ఆశతో మళ్లీ ఇక్కడ అర్జీ ఇచ్చామని ఆయా అర్జీదారులు తెలిపారు. జిల్లా అధికారులు అర్జీలు తీసుకుని మండల అధికారులకు పంపడం తప్ప గతంలో ఫిర్యాదు చేసినా వారి సమస్య ఎందుకు పరిష్కారం కాలేదు, మరోసారి ఎందుకు ఫిర్యాదు చేయాల్సి వచ్చిందనే విషయాన్ని ఆరా తీయకపోవడంతో తమ అర్జీ పరిష్కారానికి నోచుకుంటుందో, లేదో అనే అనుమానం అర్జీదారుల్లో నెలకొంది. అర్జీల్లో కొన్నింటి వివరాలిలా ఉన్నాయి. వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్ పరిసరాల్లో ఉన్న ఆక్రమణలు తొలగించాలని, స్కూల్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని గతంలో ఫిర్యాదు చేసినా పరిష్కరించకపోవడంతో మళ్లీ పలువురు ఈ అంశంపై ఫిర్యాదు చేశారు. వీరవాసరంలోని సఖినేటిపల్లి వారి వీధిలో ఆక్రమణలు తొలగించాలని మరో ఫిర్యాదు అందింది. దీనిపై జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి స్పందిస్తూ ఎంపిడిఒ, తహశీల్దార్ జాయింట్ కమిటీగా ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. తమ పంట పొలాలకు రహదారి సమస్యను పరిష్కరించాలని రైతులు మతల కాశీ, మరికొంత మంది ఫిర్యాదు చేశారు. వీరవాసరంలో డ్రెయినేజీ నిర్మాణంలో లోపాలున్నాయని, దీని వల్ల పశువుల చెరువులు, సాగునీటి బోదెలు కలుషితమవుతున్నాయని వర్ధినీడి వెంకటలక్ష్మి ఫిర్యాదు చేశారు. నరసాపురంలో గోదావరి రేవుల వద్ద ఇతర ప్రాంతాల నుండి వెళ్లి కర్మకాండలు నిర్వహించుకోవడానికి సౌకర్యాలు లేవని, మహిళలు మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాకి రాజేష్ ఫిర్యాదు చేశారు. మినీ గోకులం షెడ్డుకు ప్రభుత్వం నుండి రావాల్సి డబ్బులు రాలేదని దాసరి మాణిక్యాలరావు ఫిర్యాదు చేశారు. వీరవాసరంలో చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదని, పంచాయితీ పాలనలో అక్రమాలు జరిగాయంటూ మద్దాల అప్పారావు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, అధికారులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న అధికారులు

పేరుపాలెం బీచ్‌లో గట్టి భద్రతా చర్యలు: డిఎస్‌పి

మొగల్తూరు: కార్తీక మాసం సందర్భంగా పేరుపాలెం బీచ్‌కు వచ్చే పర్యాటకులకు ఏవిధమైన అసౌకర్యం లేకుండా గట్టి భద్రతా చర్యలు తీసుకుంటున్నామని నరసాపురం డిఎస్‌పి రవిమనోహరాచారి అన్నారు. శుక్రవారం మొగల్తూరు పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి విలేకరులతో మాట్లాడారు. బీచ్‌లో బందోబస్తుకు ప్రత్యేక సిబ్బందిని నియమిస్తున్నామన్నారు. అక్కడ ఏ విధమైన ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు తాము చేపట్టిన చర్యలకు పర్యాటకులు సహకరించాలని కోరారు. డివిజన్‌లో నేరాలను అదుపు చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ఆయన వెంట ఎస్ఐ ఎం.వీరబాబు, సిబ్బంది ఉన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న డిఎస్‌పి

డిమాండ్ ఉన్న వరి రకాలనే సాగుచేయాలి: కలెక్టర్

పెనుమంట్ర: రైతులు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వరి రకాలను సాగు చేస్తే మద్దతు ధర పొందొచ్చని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానంలో శుక్రవారం జరిగిన గోదావరి జిల్లాల రైతులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు, మిల్లర్లు, ఎగుమతిదారుల సమావేశానికి పరిశోధనా స్థానం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.భరతలక్ష్మి అధ్యక్షత వహించారు. తొలుత రైతులు తమ ఇబ్బందులను ఆచార్య ఎన్‌జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సంచాలకులు డాక్టర్ ఎం.సుబ్బిరామిరెడ్డి, బోర్డు సభ్యులు ఈశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లాకు చెందిన రైతు ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తాము పండించిన పంట అమ్ముకునే సమయంలో మిల్లరు ధర నిర్ణయించినా దళారుల వల్ల తమకు బస్తాకు రూ.100 నుంచి రూ.200 వరకూ నష్టం వాటిల్లుతుందన్నారు. దీనిపై బోర్డు సభ్యులు ఈశ్వరరావు మాట్లాడుతూ రైతులు జూన్ మొదటి వారం నుండి వరి సాగు ప్రారంభిస్తే కోత సమయానికి ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని రైతుకు పంట చేతికి దక్కుతుందన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ మంచి రకాల ఎంపిక, కాలువలకు నీరు విడుదల చేసిన వెంటనే సాగు చేయకపోవడంతో రైతులు నష్టపోతున్నారన్నారు. ప్రతి రైతూ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు పాటిస్తే నాణ్యమైన దిగుబడులు లభిస్తాయన్నారు. అనంతరం కలెక్టర్ పి.ప్రశాంతిని సన్మానించారు.

అనువైన వంగడాల సాగుకు అనుమతివ్వాలి

కలెక్టర్‌కు ఎపి రైతుసంఘం వినతి

రైతులు తమకు అనువైన వంగడాలు సాగు చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని ఎపి రైతుసంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రశాంతికి శుక్రవారం ఆ సంఘం నేతలు అందజేశారు. మార్టేరు వరి పరిశోధనా కేంద్రంలో సమావేశానికి హాజరైన కలెక్టర్‌ను రైతుసంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జుత్తిగ నరసింహమూర్తి, ఆకుల హరేరామ్ కలిసి వినతి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్కువ కాలంలో పంట చేతికొచ్చే విత్తనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. పిఆర్ 126 రకాన్ని రైతులందరూ కోరుకుంటున్నారని, ఈ రకం సాగుకు అనుమతించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజారోగ్యంతో పంచాయతీ చెలగాటం..!

తాగునీటి ఇబ్బందులు వివరిస్తున్న మహిళలు

పాలకోడేరులో కలుషిత నీరు సరఫరా
రోగాలతో మంచం పడుతున్న గ్రామస్తులు
కనీసం క్లోరినేషన్ చేయకుండానే నీటి సరఫరా
కాంట్రాక్టర్‌కు ఆలం బిల్లులను చెల్లించని పంచాయతీ
పట్టించుకోని సర్పంచి, ఆందోళనలో ప్రజలు

ప్రజాశక్తి - పాలకోడేరు

పాలకోడేరులో ప్రజారోగ్యంతో పంచాయతీ చెలగాటమాడుతోందనే విమర్శలు విన్పిస్తున్నాయి. క్లోరినేషన్ చేయకుండానే రా వాటర్‌నే నేరుగా తాగునీటిగా సరఫరా చేస్తుండటం గమనార్హం. ఐదు నెలల నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతున్నా సర్పంచి స్పందించడం లేదనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. దీంతో కలుషిత నీటినే గ్రామస్తులు తాగుతూ రోగాల బారిన పడుతున్నారు.

జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న మండల కేంద్రం పాలకోడేరు. అయితే ఈ మండల కేంద్రంలో ఉన్న సమస్యలను పట్టించుకునే నాథుడే లేడు. జనం తమ సమస్యలు విన్నవించుకున్నా అధికారులు పట్టనట్లు ఉంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పాలకోడేరు పంచాయతీకి సంబంధించి అనేక సమస్యలు అధికారుల దృష్టికి వెళ్లినా కనీస చర్యలు తీసుకోవడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. ముఖ్యంగా తాగునీటి సమస్య పాలకోడేరువాసులను పట్టిపీడిస్తోంది. పంచాయతీ సరఫరా చేసే తాగునీరు కలుషితం కావడమే ప్రధాన సమస్య. కనీసం క్లోరినేషన్ చేయకుండా రా వాటర్‌నే నేరుగా కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారు. గ్రామంలో మంగయ్య, ధర్మ చెరువులు రెండు ఉన్నాయి. వీటికి అవసరమైన ఫిల్టర్ బెడ్లు, ఒ హెచ్‌ఆర్ ట్యాంకులు ఉన్నాయి. గ్రామంలో సుమారు 15 వేల మంది జనాభా ఉన్నారు. కలుషిత నీటిని తాగి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. నత్త గుల్లలు, మట్టి, పురుగులు కూడా తాగునీటిలో వస్తున్న పరిస్థితి ఉంది. దీంతో ధనికులు కొంతమంది నీటిని కొనుగోలు చేసుకుని, మరికొంతమంది సుదూర ప్రాంతాలకు వెళ్లి తాగునీటిని తెచ్చుకుంటున్నారు. అయితే ఇవేమీ చేయలేని నిరుపేదలు పంచాయతీ నీటినే తాగుతున్నారు. దీంతో గ్రామంలో టైఫాయిడ్, వైరల్ జ్వరాల బాధితులు పెద్దసంఖ్యలో ఉంటున్నారు.

మురికిగా వస్తున్న కుళాయి నీరు

ఐదు నెలలుగా ఇదే పరిస్థితి

గ్రామంలో కుళాయిల ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఐదు నెలల నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతున్నా పంచాయతీ సర్పంచి ఇంజేటి మరియమ్మ లక్ష్మీపతి స్పందించిన దాఖలాల్లేవని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సమస్యను పలుసార్లు సర్పంచి దృష్టికి తీసుకెళ్లినా చర్యల్లేవని విమర్శిస్తున్నారు. చివరకు తాగునీటిని శుద్ధి చేసే నిమిత్తం ఉపయోగించే ఆలంకు సుమారు రూ.2 లక్షలు కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సి ఉంది. అయితే పంచాయతీ నుంచి ఈ చెల్లింపులు నిలిపివేయడంతో కాంట్రాక్టర్ ఆలము సరఫరా నిలిపివేశారు. ఈ నేపథ్యంలో ఉప సర్పంచి దెందుకూరి వెంకటరాజు సొంత సొమ్ము వెచ్చించి ఆలమును కొనుగోలు చేసి గ్రామస్తులకు కొన్నాళ్లు రక్షిత నీటిని అందించారు. అయితే వీటికి సంబంధించిన బిల్లులు కూడా సర్పంచి చేయలేదు. తాను పెట్టుబడి పెట్టిన వాటికి బిల్లులు చెల్లిస్తే మరికొంత పెట్టుబడి పెట్టేవాడని, బిల్లులు చెల్లించకపోతే తాను పెట్టుబడి పెట్టలేనని ఉపసర్పంచి చెప్పడంతో తాగునీటి సమస్య మళ్లీ మొదటికొచ్చింది.

సర్పంచికి కమీషన్ ఇస్తేనే పని చేస్తారంట

రాపాక ప్రకాష్‌రావు, చినపేట గరువు

నీళ్లు మురికిగా వస్తున్నాయని సర్పంచికి అనేక సార్లు చెప్పాం. కనీసం పట్టించుకోలేదు. పైగా కమీషన్ ఇస్తేనే పని చేస్తానని చెబుతున్నారు. డ్రెయినేజీ సౌకర్యం కూడా లేదు. మా గ్రామంలో సమస్యలను పట్టించుకునే వారే లేరు.

ఎసరు పెట్టేందుకూ పనికి రాని దుస్థితి

సన్నమండ లక్ష్మి, పాలకోడేరు

పంచాయతీ సర్పంచి చేస్తే నీళ్లు తాగలేకపోతున్నాం. నీళ్లన్నీ మురికిగానే వస్తున్నాయి. కనీసం అన్నం వండుకునేందుకు ఎసరు పెట్టేందుకూ నీళ్లు పనికి రావట్లేదు. స్నానం చేస్తున్నప్పటికీ శరీరమంతా దురదలు దద్దుర్లు వస్తున్నాయి. ఎవరికి చెప్పినా ఏమీ పట్టించుకోవట్లేదు.

నీళ్లు దుర్వాసన వస్తున్నాయి

గడ్డం సుభద్ర, పాలకోడేరు

ప్రతిరోజూ కుళాయి ద్వారా నీరొస్తుంది. అయితే ఏం లాభం. సరఫరా చేసే నీరు పూర్తిగా కలుషితమైంది. తాగునీరు తీవ్ర దుర్వాసన వస్తుంది. తాగేందుకు పనికి రాకుండా ఉంది. అలాగని సుదూర ప్రాంతాలకు వెళ్లి నీళ్లు తెచ్చుకోలేకపోతున్నాము. దిక్కులేని స్థితిలో ఈ నీటిని తాగి రోగాల పాలవుతున్నాం.

తాగునీటిలో పురుగులొస్తున్నాయి

నరికిమిల్లి కుమారి, పాలకోడేరు

పంచాయతీ సరఫరా చేసే నీటిలో పురుగులు వస్తున్నాయి. నత్త గుల్లలు, మట్టి కూడా వస్తోంది. ఎందుకు పనికిరాని నీటినే సరఫరా చేస్తున్నారు. అసలు మమ్మల్ని మనుషులుగా చూస్తున్నట్లు లేదు. డ్రెయినేజీ సదుపాయం లేక దోమలు విజృంభిస్తున్నాయి. అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదు.

గొడవలను సాకుగా చూపి..!

సన్నమండ ఏసు, వార్డు సభ్యులు, పాలకోడేరు

పంచాయతీలో ఏవేవో గొడవలు ఉన్నాయి. ఆ గొడవలను సాకుగా చూపి మమ్మల్ని కనీసం పట్టించుకోవట్లేదు. వార్డు సభ్యునిగా ఉన్న మా ప్రాంతానికి రక్షిత తాగునీరు అందట్లేదు. పంచాయతీ సరఫరా చేసే కలుషిత నీరు తాగి జనం రోగాల బారిన పడుతున్నారు. ఐదు నెలల నుంచి ఇదే పరిస్థితి ఉన్నా సర్పంచి కనీసం ఇటువైపు చూడలేదు. పట్టించుకోలేదు.

పిల్లలు అనారోగ్యంతో ఉన్నారు

సన్నమండ శిరీష, పాలకోడేరు

నాకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. మేమంతా కుళాయి నీటినే తాగుతున్నాం. ఆ నీళ్లు మురికిగా ఉండటమే కాకుండా పురుగులొస్తున్నాయి. నా ఇద్దరి పిల్లలకు జ్వరం వచ్చింది. ఆసుపత్రికి వేలాది రూపాయలు ఖర్చు చేశాం. కలుషిత నీటి వల్లే ఈ ఇబ్బంది.

మౌలిక సదుపాయాల్లేకుండా ఇళ్ల నిర్మాణం ఎలా

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

లబ్ధిదారులతో మాట్లాడుతున్న సిపిఎం నేతలు

ఉండి: జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించకుండా ఇళ్ల నిర్మాణం చేపట్టాలని లబ్ధిదారులను ఒత్తిడికి గురి చేయడం సమంజసం కాదని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం విమర్శించారు. శుక్రవారం ఉండి పెద్దపేటలోని జగనన్న కాలనీలో సిపిఎం బృందం పర్యటించింది. లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బలరాం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదలకు స్థలాలు కేటాయించడం సంతోషకరమైన విషయమేనన్నారు. అయితే కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించకుండా ఇళ్ల నిర్మాణం చేపట్టాలని అధికారులు లబ్ధిదారులపై ఒత్తిడి తీసుకురావడం సమంజసం కాదన్నారు. ఇప్పటికే కొంతమంది లబ్ధిదారులు అధికారుల బెదిరింపులకు తలొగ్గి అప్పు చేసి ఇంటి పునాదులు నిర్మించారని, అంతటితో నిర్మాణాలు ఆగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు 600కుపైగా లబ్ధిదారులు ఉండగా వారిలో సుమారు వంద మంది లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు చేపట్టారని, వాటిలో 70 శాతం పునాది దశలోనే ఉండిపోయాయని అన్నారు. ఇంటి నిర్మాణాలు చేపట్టాలంటే సుమారు రూ.8 లక్షల నుండి రూ.10 లక్షల వరకు ఖర్చవుతుందన్నారు. ప్రభుత్వం అందించే రూ.లక్షా 80 వేలు ఇంటి నిర్మాణానికి సరిపోవని, మరో రూ.ఐదు లక్షలు ప్రభుత్వం అందించి ఇంటి నిర్మాణాలను ప్రోత్సహించాలన్నారు. ఇప్పటికే పలువురు లబ్ధిదారులు అప్పులు చేసి ఇంటి నిర్మాణాలు చేశామని తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. నిర్మాణాలు పూర్తి చేసిన లబ్ధిదారులకూ మరో రూ.ఐదు లక్షలు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాలనీలో నివాసం ఏర్పర్చుకున్న లబ్ధిదారులకు సుమారు పది రోజులకు ఒకసారి వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని పంచాయతీ వారు అందిస్తున్నారని, అయితే పది రోజులపాటు నిల్వ నీరు తాగితే అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉందని అన్నారు. కనీసం రెండు రోజులకు ఒకసారైనా వాటర్ టాంయకర్‌ను కాలనీకి పంపించాలని పంచాయతీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. జగనన్న కాలనీ చివరకు వచ్చేసరికి వీధి దీపాలు లేవని, అధికారులు స్పందించి వీధి దీపాలు వేయించాలని కోరారు. హైస్కూల్‌ను ఆనుకుని ఉన్న లేఅవుట్‌ను ఇప్పటి వరకు లబ్ధిదారులకు అందజేయకపోవడం బాధాకరమన్నారు. గత మూడు సంవత్సరాలుగా ఈ లేఅవుట్‌ను పూడిక పేరుతో లబ్ధిదారులకు అందజేయకపోవడం వెనుక మర్మం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. వెంటనే లేఅవుట్‌ను లబ్ధిదారులకు స్వాధీనపర్చాలన్నారు. లేనిపక్షంలో లబ్ధిదారులను సమీకరించి ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. జగనన్న కాలనీలో పర్యటించిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్, నాయకులు కొట్టాడ వెంకటేశ్వరరావు, నక్కా వెంకటేశ్వరరావు, మోపిదేవి రాము, లబ్ధిదారులు ఉన్నారు.

అగ్నిప్రమాద బాధితురాలికి సాయం

కాళ్ల: కలవపూడి గ్రామ పంచాయతీ మోడీ గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో బర్రె వెంకటేశ్వరమ్మకు చెందిన రేకుల షెడ్డు దగ్ధమైంది. వెంకటేశ్వరమ్మ షెడ్డులో కిరణ్ షాపు నిర్వహిస్తుండడంతో సామానుతో పాటు సామగ్రి కూడా కాలి బూడిదైంది. ఈ ప్రమాదంలో లక్ష రూపాయల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితురాలు వాపోయింది. విషయం తెలుసుకున్న ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు బాధిత కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు. ఎంఎల్‌ఎ రామరాజు రూ.5 వేలు, మాజీ ఉప సర్పంచి మంతెన వేణు గోపాలరాజు రూ.5 వేల తక్షణ ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచి గేదెల జాన్, నంబూరు త్రినాథ మూర్తిరాజు, ఎం.నరసింహరాజు, యేసు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు, రొట్టెల పంపిణీ

ఆచంట: విశాఖ శ్రీశారద పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి పుట్టినరోజును పురస్కరించుకుని ఎంఎల్‌సి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆదేశాల మేరకు రామేశ్వరస్వామి ఆలయంలో వృద్ధులకు శుక్రవారం పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కోట సరోజినీ వెంకటేశ్వరరావు, వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షులు పెచ్చేటి సత్యనారాయణ, నేతలు విద్యాసాగర్, శ్రీనివాస్, ఆలయ కార్యనిర్వాహణాధికారి రామచంద్ర కుమార్ పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

ప్రజాశక్తి - నరసాపురంటౌన్

మానసికోల్లాసానికి క్రీడలు దోహదపడతాయని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన కొవ్వలి ఆల్ ఇండియా సీనియర్ టెన్నిస్ పోటీలను ప్రసాదరాజు ప్రారంభించి మాట్లాడారు. ఏటా అయ్యప్ప ఆధ్వర్యంలో జాతీయస్థాయి టెన్నిస్ పోటీలు విజయవంతంగా నిర్వహిస్తున్న వారు అభినందనీయులు అన్నారు. ఇటువంటి క్రీడలు ఇక్కడ కాకుండా వైజాగ్ కళాశాల తదితర ప్రాంతాలలో నిర్వహించేందుకు కృషిచేయాలన్నారు. జాతీయ టెన్నిస్ పోటీల నిర్వాహకులను సత్కరించిన కొవ్వలి రామ్మోహన్ నాయుడును, నిర్వాహకుల బుజ్జి, చిన రెడ్డప్ప ధవేజీని అభినందించారు.

దేశానికే ఆదర్శం 'జగనన్న ఆరోగ్య సురక్ష'

డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష దేశానికి ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్‌లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ శిబిరాన్ని సందర్శించిన ఆయన అన్ని విభాగాలను పరిశీలించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం ముఖ్యమంత్రి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెడితే తాను నియోజకవర్గ ప్రజల కోసం మెగా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ శిబిరాల్లో వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు ఇస్తున్నట్లు తెలిపారు. మెడికల్ క్యాంపు నిర్వహణకు జిఎస్ఎల్ ఆసుపత్రి యాజమాన్యం పూర్తి ఆధునిక సదుపాయాలతో కూడిన రెండు మొబైల్ మెడికల్ యూనిట్లను, డాక్టర్లను, సిబ్బందిని పంపించి ఎంతో సహకారం అందించిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అనపర్తి శామ్యూల్, ఎంపిపి ఛైర్మన్ మున్సిపల్ సంపత్ కుమార్, టౌన్ ప్రెసిడెంట్ గుండుబోగుల నాగు, వన్ టౌన్, టూ టౌన్ జెఏ ఎస్ కన్వీనర్లు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలి

రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్

భీమవరం రూరల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని, చిన్నపాటి అనారోగ్య సమస్య ఎదురైనప్పటికీ నిర్లక్ష్యం వహించకుండా ప్రభుత్వ వైద్య సేవలు పొందాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ ప్రజలకు సూచించారు. అనాకోడేరు గ్రామపంచాయతీ పరిధిలోని తుమ్మగొప్పు ప్రాంతానికి చెందిన నక్కా ప్రశాంతికి వైద్య సేవల నిమిత్తం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.రెండు లక్షల విలువైన ఎల్‌ఓసిని శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆమె బంధువు ఇస్సాక్‌కు ఎంఎల్‌ఎ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్య సమస్యలు తలెత్తినపుడు వెంటనే ప్రాథమిక స్థాయిలోనే పరీక్షలు చేయించుకుంటే నయం చేయడానికి అవకాశం ఉంటుందన్నారు.

పోరాట యోధుడు శంకరయ్య

ఆకివీడు: అణగారిన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన యోధుడు ఎన్.శంకరయ్య అని సిపిఎం నాయకురాలు దోకల లక్ష్మి అన్నారు. సిపిఎం కేంద్ర కార్యవర్గ సభ్యులు, స్వాతంత్ర సమరయోధుడు శంకరయ్య మృతి పట్ల సిపిఎం పట్టణ కమిటీ సంతాపం తెలిపారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో మండల కార్యదర్శి కె.తవిటినాయుడు శంకరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దోకల లక్ష్మి అధ్యక్షత జరిగిన సభలో ఆమె మాట్లాడారు. 95 ఏళ్ల వయసులో కూడా ఆయన తమిళనాడులో కుల దురహంకారానికి వ్యతిరేకంగా ఆందోళన చేయడం గొప్పతనం అన్నారు. శంకరయ్య ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని ఆమె కోరారు. కార్యక్రమంలో పి.అప్పారావు, సందక సూరిబాబు, ఎస్.ఐ.వలీ, సందక ఉదయ కుమార్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

గణపవరం: యుక్త వయస్సు ఆడపిల్లలు రుతుక్రమంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్ పి.కిరణ్మయి అన్నారు. ఫ్రైడే డ్రైడే సందర్భంగా శుక్రవారం స్థానిక బాలికల హైస్కూల్లో పిల్లలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంతోషనాయుడు మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి ఫిబ్రవరి రెండో తేదీ వరకూ జరుగుతున్న భేటీ బచావో భేటీ పడావో నినాదం మండలంలోని అన్ని హైస్కూల్స్‌లో పిల్లలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ జాలాది విల్సన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

పెనుమంట్ర: 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం విద్యార్థులకు నీటి సంరక్షణపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మార్టేరు రోటరీ పంప్ గ్రామాల పాఠశాలల నుండి 50 మంది విద్యార్థులు పాల్గొన్నారని గ్రంథాలయ అధికారి పిటి.శివకుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో మానవత పెనుమంట్ర శాఖ అధ్యక్షులు బాణాల శ్రీనివాసరావు, మానవత ఆత్మీయ సహకార కమిటీ ఛైర్మన్ చిర్ల శ్రీనివాస్‌రెడ్డి, రోటరీ అధ్యక్షులు గుడిమెట్ల లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం స్థానిక ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో 'భార్య చనిపోతే భర్త పరిస్థితి' అనే అంశంపై కోపల్లె శ్రీనివాస్ చేసిన ఏక పాత్రాభినయం అందరినీ ఆకట్టుకుంది. ఎల్ఐసి ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు బావయ్య శర్మ మాట్లాడారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావు, సత్యనారాయణ, వీరాస్వామి పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : నరసాపురం ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయం వద్ద గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా కవి సమ్మేళనం - సాహిత్య సభ జరిగింది. ముఖ్యఅతిథి ఎంఎస్ సూర్యనారాయణ నేనొక అభాగిని అనే పుస్తకం స్వీయ కవిత గానం చేశారు. విశిష్ట అతిథి బాబు గ్రంథాలయ ఆవశ్యకతను వివరించారు. కొప్పర్తి విజయకుమార్, డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడారు.

9న జాతీయ లోక్ అదాలత్

తణుకురూరల్: వచ్చే నెల 9వ తేదీన తణుకు కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్, నాలుగో అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో రాజీపడదగ్గ క్రిమినల్, సివిల్, ప్రీ లిటిగేషన్ కేసులు, వాహన ప్రమాద కేసులు కక్షిదారులు రాజీ చేసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని తెలిపారు. కక్షిదారులిద్దరికీ ఆమోదయోగ్యమైతే సత్వర పరిష్కారం పొందొచ్చని తెలియజేశారు.

యువకుడి మృతదేహం లభ్యం

మొగల్తూరు: పేరుపాలెం బీచ్ వద్ద అదృశ్యమైన ఇంజినీరింగ్ విద్యార్థి మృతదేహం శుక్రవారం లభ్యమయింది. ఎస్ఐ ఎ.వీరబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాలకోడేరుకు చెందిన కొలుకులూరి వెంకట వీరాస్వామి కుమారుడు వీర పవన్ (21) భీమవరంలోని ప్రయివేటు ఇంజినీరింగ్ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఈ నెల 15న కళాశాలకు వెళుతున్నానని ఇంటి వద్ద చెప్పి బయటకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్లలేదు. అతని కోసం గాలిస్తుండగా 16వ తేదీన పేరుపాలెం బీచ్ వద్ద యువకుని బ్యాగు, ఫోను తదితర సామగ్రి లభ్యమైంది. విద్యార్థి అదృశ్యంపై అతని సోదరుడు వీర్రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. బీచ్ వద్ద గాలించగా యువకుని మృతదేహం లభ్యమైందని తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

కాళ్లకూరులో శిలాఫలకాలు ధ్వంసం

కారకులను శిక్షించాలి - పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామస్తుల ఆందోళన

పద్మావతి తాగునీటి చెరువు వద్ద ధ్వంసం చేసిన శిలాఫలకాలు

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరు గ్రామంలో పద్మావతి తాగునీటి చెరువులో దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మూడు నెలల క్రితం ఏర్పాటు చేసిన రెండు శిలాఫలకాలను శుక్రవారం వైసిపిలో ఒక గ్రూపునకు చెందిన నేతలు ధ్వంసం చేశారు. ఈ నేపథ్యంలో దాట్ల వెంకట రామరాజు ఆధ్వర్యంలో కాళ్లకూరు పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి. పద్మావతి తాగునీటి చెరువులో రేవులు శిథిలావస్థకు చేరాయి. చెరువులో పూడికతీత పనులను చేపట్టడమే కాకుండా మూడు రేవులు, రిటైనింగ్ వాల్‌ను రూ.13 లక్షలతో నిర్మించారు. వాటిని పివిఎల్.నరసింహరాజు చేతుల మీదుగా ప్రారంభించారు. అయితే ఈ ప్రారంభత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాలను వైసిపిలో ఒక గ్రూపునకు చెందిన నేతలు ధ్వంసం చేయడంతో వాటిని పంచాయతీ కార్యాలయంలో ఉంచారు. వైసిపి ప్రజాప్రతినిధులే ఈ చర్యకు పాల్పడడం దారుణమని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎవరు ఎన్ని అరాచకాలు చేసినా కాళ్లకూరు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉన్న దాట్ల వెంకటరామరాజును, ఆయన చేసిన అభివృద్ధి పనులను చెరపలేరని తెలిపారు. రెండు శిలాఫలకాలు, ఆర్చ్‌ను ధ్వంసం చేసిన వారిని శిక్షించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. శిలాఫలకాలు ధ్వంసం చేయడం దుర్మార్గమని శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత దాట్ల వెంకట రామరాజు ఆవేదన వ్యక్తం చేశారు. మంచి ఉద్దేశంతో కాళ్లకూరులో ట్రస్ట్ ద్వారా రూ.70 లక్షలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. పంచాయతీ నుంచి బిల్లులు చేసుకునేందుకు శిలాఫలకాలను ధ్వంసం చేశారని తెలిపారు. దాతలను భయపెట్టేలా కొంతమంది వైసిపి నాయకులు వ్యవహరించడం సరికాదన్నారు. దీనిపై పంచాయతీ గ్రామ కార్యదర్శి జి.సునీల్ రాజును వివరణ వివరణ కోరగా పద్మావతి చెరువు వద్ద శిలాఫలకాలు, ఆర్చి ధ్వంసం చేయడం తనకు తెలీదని తెలిపారు. చెరువు తవ్వకానికి, రేవుల నిర్మించడానికి అనుమతులు ఇచ్చామని, ఒక శిలాఫలకం ఏర్పాటు చేసేందుకు అనుమతిచ్చామని తెలిపారు. రెండో శిలాఫలకం, ఆర్చ్‌ను ఏర్పాటు చేసేందుకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. తాగునీటి చెరువు పంచాయతీ పరిధిలో ఉన్నప్పటికీ ఆ చెరువును వెంకటేశ్వరస్వామి దేవస్థానం వారు ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. మూడు నెలల క్రితం శిలాఫలకాలు, ఆర్చ్‌ను తొలగించాలని దాట్ల వెంకటరామరాజుకు నోటీసులిచ్చామని తెలిపారు.

పంచాయతీ కార్యాలయంవద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ వేదిక

కలెక్టర్ పి.ప్రశాంతి

ప్రజాశక్తి - వీరవాసరం

ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించుకోవడానికి ఉద్యోగుల గ్రీవెన్స్ ఒక చక్కటి వేదిక అని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యోగుల గ్రీవెన్స్‌ను కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల ఉద్యోగుల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులు సమస్యలతో ఉంటే వారి విధులు సవ్యంగా నిర్వర్తించలేరన్నారు. ఈ గ్రీవెన్స్‌లో మొత్తం తొమ్మిది దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలోని అన్ని మార్కెట్ కమిటీల్లో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, సెక్యూరిటీగార్డు పేరును యార్డు అసిస్టెంట్‌గా మార్పు చేయాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఐ.సత్యనారాయణ, సిహెచ్.లక్ష్మణరావు, డి.రాజేష్‌కుమార్, వి.రాంబాబు కోరారు. తనకు మూడు రోజుల జీతం కారణం చెప్పకుండా కట్ చేశారని పాలకొల్లు మున్సిపల్ వాటర్ వర్క్సు ఉద్యోగి సాక సునీల్‌కుమార్ ఫిర్యాదు చేశారు. ఉద్యోగ విరమణ చేసి చాలా రోజులు గడిచినా తనకు రావాల్సిన బెనిఫిట్స్ ఇంకా రాలేదని మార్టేరు వ్యవసాయ పరిశోధనా సంస్థ ఉద్యోగి కాండ్రు డేవిడ్‌రాజు ఫిర్యాదు అందించారు. గొల్లవానితిప్ప వైద్యాధికారిపై ఎఎన్ఎం, సిబ్బంది ఫిర్యాదు చేస్తే బయటి వ్యక్తుల నుండి రాజీ చేసుకోవాలంటూ ఫోన్లు వస్తున్నాయని, దీనిపై విచారణ చేసి తమకు న్యాయం చేయాలని బాపట్ల షాలెంరాజు కోరారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.శ్రీనివాసులురాజు, డిప్యూటీ ట్రెయినీ కలెక్టర్ సంగీత్ మాథుర్, డిపిఒ జివికె.మల్లికార్జునరావు, భీమవరం డిఎల్‌డిఒ ఎవి.అప్పారావు, తహశీల్దార్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

కలవపూడి సహకార సంఘం చైర్మన్ గంటయ్య

ప్రజాశక్తి - కాళ్ల

రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, సహకార బ్యాంకు ద్వారా పార్టీలకతీతంగా రైతులకు సేవలందిస్తామని కలవపూడి సహకార సంఘం ఛైర్మన్ బర్రె గంటయ్య అన్నారు. కలవపూడి వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో సొసైటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సహకార సంఘం ఛైర్మన్ బర్రె గంటయ్య మాట్లాడుతూ సహకార బ్యాంకు అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానన్నారు. రైతులకు అవసరమైన రుణాలు ఎప్పటికప్పుడు అందిస్తూ వారి అభివృద్ధికి దోహదపడుతున్నామన్నారు. డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు తనదైన శైలిలో రైతుల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. సభ్యులు, సిబ్బంది సహకారంతో సొసైటీని మరింత అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు పెనుమత్స దుర్గా ప్రసాదరాజు, యాళ్ల నందమ్మ, సొసైటీ సిఇఒ కనుమూరి శ్రీరామ వెంకట సత్య నరసింహరాజు (మణి) పాల్గొన్నారు.

కలవపూడి సొసైటీ సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్

3న రజకుల గర్జన సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రజకులపై నేటికీ కుల భావన, దాడులు, సాంఘిక బహిష్కరణ జరుగుతూనే ఉన్నాయని రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి మున్నూరు భాస్కరయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక అపరాల మార్కెట్ వర్కర్స్ యూనియన్ భవనంలో మడక రాజు అధ్యక్షతన రజకుల అవగాహన చైతన్య తరగతులను జయప్రదం చేయాలని కోరుతూ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మున్నూరు భాస్కరయ్య మాట్లాడుతూ గడిచిన నాలుగు సంవత్సరాల కాలంలో వైసిపి ప్రభుత్వం రజకులకు చేసిందేమీ లేదన్నారు. రజకులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ మాదిరిగా సామాజిక రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఈ ప్రభుత్వం రజకుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. వృత్తి చెరువులపై పూర్తి హక్కు రజకులకు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ హాస్పిటల్స్, గురుకుల పాఠశాలల్లో, దేవాలయాల్లో, ఖాళీగా ఉన్న దోబీ పోస్టులు భర్తీ చేయాలన్నారు. వచ్చే నెల 3, 4 తేదీల్లో జరిగే రజక చైతన్య తరగతుల్లో చర్చించి భవిష్యత్తు ఉద్యమానికి సిద్ధం కావాలని కోరారు. డిసెంబర్ 3వ తేదీ ఉదయం 10 గంటలకు జరిగే రజకుల గర్జన సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వద్దిపర్తి శ్రీనివాస్, మడక రాజు, జిల్లా నాయకులు పసుపులేటి శ్రీనివాస్, పెనుమూడి రవి పాల్గొన్నారు. అనంతరం 25 మంది సభ్యులతో ఆహ్వాన కమిటీ ఏర్పాటు చేశారు.

కూటమి అధికారంలోకి వస్తే లబ్ధి : ఎంఎల్‌ఎ నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు, పాలకొల్లు రూరల్

టిడిపి, జనసేన కూటమి అధికారంలోకి రాగానే అన్ని వర్గాల ప్రజలకూ లబ్ధి చేకూరుతుందని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు తెలిపారు. రూరల్ గ్రామాల్లో, పాలకొల్లులోని ఎనిమిదో వార్డులో చేపట్టిన భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ నిమ్మల పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు చేపట్టనున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం వారికి బాండ్లు అందజేశారు. అనంతరం ఎంఎల్‌ఎ మాట్లాడారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ సారథ్యంలో అధికారంలోకి వచ్చే కూటమి రాష్ట్ర అభివృద్ధి, అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. ప్రతి ఇంటిలో 18 సంవత్సరాలు నిండిన మహిళలకు ప్రతి ఒక్కరికీ నెలకు 1500 చొప్పున ఏడాదికి రూ.18,000, తల్లికి వందనంలో ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే వారందరికీ ఏడాదికి రూ.15,000 చొప్పున అందిస్తామని తెలిపారు. ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇస్తామని చెప్పారు.

రిలే దీక్షలకు అనుమతించాలని వినతి

పెనుమంట్ర: ఈ నెల 21వ తేదీన తమ సమస్యలపై చేపట్టనున్న రిలే నిరాహార దీక్షకు అనుమతించాలని కోరుతూ ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయ సిబ్బందికి అంగన్‌వాడీ కార్యకర్తలు శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ లీడర్ ఎం.సాయి మహాలక్ష్మి, శ్రీదేవి, రాజేశ్వరి, శాంతి, అలివేలు మంగతాయారు, కామేశ్వరి పాల్గొన్నారు.

సొసైటీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

డిఆర్ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - పాలకోడేరు

రైతులకు మెరుగైన సేవలందిస్తున్న సహకార సంఘాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర కో-పరేటివ్ యూనియన్ డిస్ట్రిక్ట్ రిజిస్టర్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. సహకార వారోత్సవాలను పాలకోడేరు సహకార సంఘం ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. పాలకోడేరు సహకార సంఘం ఛైర్మన్ కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు సహకార జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా పాలకోడేరు ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఫణికుమార్, సంఘం కార్యదర్శి పివిఎల్ నరసింహరాజు, సహకార సంఘ సిబ్బంది, పాలకోడేరు సహకార కళాశాల ప్రిన్సిపల్ వేటూరి పద్మావతి, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులను అందజేస్తున్న డిఆర్ వెంకటేశ్వరరావు

యుటిఎఫ్ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - పెనుగొండ

ఉపాధ్యాయులు ఒత్తిడికి గురవుతున్నారని ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ తెలిపారు. స్థానిక త్యాగరాజ కళ్యాణ మండపంలో యుటిఎఫ్ మండల నూతన కమిటీ ఎన్నిక శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ పాల్గొన్నారు. గౌరవాధ్యక్షులుగా ఎన్‌వి ఎస్ఎస్‌కె.రామలింగేశ్వరరావు, అధ్యక్షులుగా ఎస్.సురేష్, ప్రధాన కార్యదర్శిగా జి.శ్రీనివాస్, సహాధ్యక్షులుగా ఎస్.పెద్దిరాజు, మహిళా సహాధ్యక్షులుగా జివిఆర్ఎల్.కృష్ణవేణి, కోశాధికారిగా కెవివి.సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సాబ్జీ మాట్లాడారు. రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, జిల్లా అధ్యక్షులు పి.విజయరామరాజు, రామకృష్ణంరాజు, శ్రీనుబాబు కార్యక్రమంలో పాల్గొన్నారు.

హెచ్ఐవి చిన్నారులకు పోషకాహారం అందజేత

తణుకురూరల్: హెచ్ఐవి బాధిత చిన్నారులకు పోషకాహారం అందించడం అభినందనీయమని తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రిలోని ఎఆర్‌టి సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ అన్నారు. శుక్రవారం గౌతమి సాల్వెంట్స్ అధినేత మల్లిన రామచంద్రరావు హెచ్ఐవి బాధిత చిన్నారులకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, పోషకాహారం నోడల్ ఆఫీసర్ రాజేశ్వరికి అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్ అధ్యక్షులు కరుణాకర్‌చౌదరి మాట్లాడుతూ డిసెంబరు 1వ తేదీ నుంచి సీనియర్ సంస్థ తరపున సంవత్సరం వరకూ ప్రొటీన్ డబ్బాలు ఇస్తానని హామీ ఇచ్చారు. ఇషా ఆసుపత్రి తరపున డాక్టర మురళీకృష్ణ డిసెంబరు 1వ తేదీ నుండి సంవత్సరం పాటు పోషకాహారం పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఆర్‌టి సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

భూహక్కు పత్రాలు పంపిణీ చేయాలి

జాయింట్ కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డి

భీమవరం : అర్హులైన లబ్ధిదారులకు అసైన్డ్ భూముల భూ హక్కు పత్రాలను వెంటనే పంపిణీ చేయాలని జిల్లా జాయింట్ కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో లంకా లాండ్సు, ఫ్రీ హోల్డ్ రైట్స్, ఇనాం భూములు, షెడ్యూల్ క్యాస్ట్ ఏరియాలో బరియల్ గ్రౌండ్స్, కమ్యూనిటీ హాల్స్, ఎస్‌సి కార్పొరేషన్ భూములు, స్వమిత్వ, రీ సర్వే పేజ్ - 2, ఎన్‌పిఐ హౌస్ సైట్స్ తదితర అంశాలపై ఆర్‌డిఒలు, మండల అధికారులతో జిల్లా స్థాయి సమావేశం జిల్లా జాయింటు కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రీసర్వే పనులు సకాలంలో పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం చురుగ్గా పని చేయాలన్నారు. జిల్లాలో స్థానిక ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో లంకభూములు ఆచంట, పెనుగొండ, యలమంచిలి మండలాలు 823 ఎకరాలు 1,181 మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేయాలనిన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌ఒ కె.కృష్ణవేణి, ఆర్‌డిఒ కె.శ్రీనివాసులు రాజు, నరసాపురం ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ చెన్నయ్య పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

ప్రజాశక్తి - ఆచంట

రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పెనుమంచిలి గ్రామ సచివాలయం వద్ద సర్పంచి గణేశుల శేషవాణి సుబ్బారావు అధ్యక్షతన 'మా నమ్మకం నువ్వే జగన్' డిజిటల్ బోర్డు ప్రారంభం, జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్ ఉద్దేశమని, కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నందునే ప్రజలు మళ్లీ జగనే కావాలంటూ కోరుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు జక్కంశెట్టి చంటి, ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

గణపవరం : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా జగన్ ప్రభుత్వం పని చేస్తోందని మండల పరిషత్ అధ్యక్షులు దండు వెంకటరామరాజు అన్నారు. శనివారం స్థానిక సచివాలయంలో రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచి మూర అలంకారం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెంకట రామరాజు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధి దిశగా నడిపిస్తోందన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తూ వారి అభివృద్ధికి కషి చేస్తున్న జగన్మోహన్ రెడ్డి మరలా సిఎం కావాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచి దండు రాము, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు సలాది రత్నకుమారి, గణపవరం పట్టణాధ్యక్షులు రొంగల శీను, సచివాలయం కన్వీనర్ సలాది నరేష్ మండల పరిషత్తు కోఆప్షన్ సభ్యులు ఎమ్‌డి జానీ పంచాయతీ కార్యదర్శి డిఎస్ఆర్.ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు వెలగపల్లిలో జనంలోకి జనసేన

గణపవరం: జనసేన ఆధ్వర్యంలో శనివారం వెలగపల్లిలో 'జనంలోకి జనసేన' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ నాయకులు తోట పవన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పి.ధర్మరాజు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొనాలని కోరారు.

రోగులకు అందుబాటులో ఉండాలి

ఆచంట: వల్లూరు పిహెచ్‌సిలో స్టాఫ్ నర్సులు 24 గంటలూ అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి ఆదేశించారు. వల్లూరు పిహెచ్‌సిలో శుక్రవారం ఎంపిపి, పిహెచ్‌సి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ దిగమర్తి సూర్యకుమారి అధ్యక్షతన కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులను చిరునవ్వుతో, ప్రేమతో పలకరించి వారి సమస్యను పూర్తిగావిని వారి వ్యాధులను నయం చేయడానికి వైద్య సిబ్బంది కృషి చేయాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నేలపూడి బేబీ, డాక్టర్ హైందవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేరు మార్పు ప్రకటన

నా కుమారుడు అయిన మండ శ్రీరుసయేంద్ర రెడ్డి పాస్‌పోర్టు నందు నా పేరు మండ ధనలక్ష్మి, మండ ధనలక్ష్మి (కొత్త పేరు). గతంలో నా పేరు మండ ధనలక్ష్మి (పాత పేరు), డోర్ నెం. 3-65, నడుపుంట వీధి, కంతేరు గ్రామం, ఇరగవరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ నందు నివసించుచున్నాను. ఇప్పుడు నా పేరును **మండ ధనలక్ష్మి** (పాత పేరు) **మండ ధనలక్ష్మి** (కొత్త పేరు)గా మార్చుకున్నాను. ఈ రోజు నుండి తదుపరి అన్ని లావాదేవీల కోసం నా కొత్త పేరును ఉపయోగించవలెను.

సెల్: 7993369937

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, కాళ్ళ మండలం, కలవపూడి గ్రామం కాపురస్తులైన ఇగ్గీర్సి కరునమ్మ, W/o. జాన్ అను నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. పాస్‌పోర్టు నెం. **T068044** గల పాస్‌పోర్టు 13-11-2023వ తేదీన మా స్వగ్రామం కలవపూడి నుండి యనమదుర్రు గ్రామం మా బంధువులు ఇంటికి వచ్చి ప్రయాణంలో యనమదుర్రు నుండి మా స్వగ్రామం వచ్చుటకు ఆటో కోసం నిలబడి వేచి చూచుచుండగా నా హ్యాండ్ బ్యాగ్ మరియు నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినవి. కావున దొరికినవారు ఈక్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

ఇగ్గీర్సి కరునమ్మ
W/o. జాన్, డోర్ నెం. 5-86
హరిజనపేట, కలవపూడి
కాళ్ళ మండలం, సెల్: 900065886

మహారాజశ్రీ ఒంగోలు ఫ్యామిలీ కం ఎనిమిదో అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

FC OP No : 35/2023

గోవిందన్ వినోద్ కుమార్ ... పిటిషనరు
వర్సెస్
గుంటూరు లలిత .... రెస్పాండెంట్

To
గుంటూరు లలిత,
భర్త గోవిందన్ వినోద్ కుమార్,
తండ్రి గుంటూరు సీతారామయ్య, వయస్సు 23 సంవత్సరాలు, హిందూ గృహిణి, డోర్ నెంబర్ 3-145, కమ్మవారి వీధి, కొత్తూరు గ్రామం, పెద్దపాడు మండలం, పశ్చిమగోదావరి జిల్లానివాసం

పై నెంబర్ గల పిటిషనును, పిటిషనరు విడాకులు నిమిత్తం మీపై దాఖలు చేయగా, సదరు పిటిషను మీకు నోటీసు నిమిత్తం తేదీ: 04-12-2023కి వాయిదా వేసియున్నారు సదరు విషయంపై మీకు ఏమైనా ఆక్షేపణలువున్న యెడల సదరు తేదీ ఉదయం 10 గంటల 30 నిమిషాలకు పై కోర్టు ఎదుట నీవు స్వయంగా గాని లేక వకీల్ ద్వారా గాని హాజరై మీఆక్షేపణలు తెలుపుకొనవలసినది లేనియెడల మీ పరోక్షమునందు విచారించి తీర్మానించ బడునని తెలియజేయుచున్నాము

// కోర్టు వారి ఉత్తర్వులు మేరకు //

ఇట్లు
కుర్రి బ్రహ్మారెడ్డి
అడ్వకేట్, ఒంగోలు
ప్రకాశం జిల్లా

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P. 27/2020, O.S. 35/2017 of R.C.Puram S.C.J.

కర్రి హరినాధరెడ్డి, S/o. సత్యనారాయణరెడ్డి, వ్యవసాయం, గోపాల రామనాయుడు పేట, కొంకుదురు, బిక్కవోలు మండలం. ...DHR

Vs

కొప్పిశెట్టి దుర్గ, W/o. నాగు, వయస్సు 40 సం॥లు, డో.నెం. 4-102, వేగవరం, జంగారెడ్డిగూడెం మండలం. ...JDR

వేలం వాయిదా: 8-12-2023

ఈ నెంబరు డిక్రీ బాకీకిగాను JDR కు గల E.P. షెడ్యూలు దాఖలా ఆస్తిని **ది. 8-12-2023వ తేదీన పై కోర్టు వారి ఎదుట ఉదయం 10.30 ని॥** లగాయతు వేలం జరుగును. వేలం నందు పాట పాడుకొనదలచినవారు వేలపు షరతులు కోర్టు నజారత్ నందు గాని, DHR గారి ఆఫీసు నందు గాని తెలుసుకొనవచ్చును.

షెడ్యూలు: పశ్చిమగోదావరి జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం మండలం, జంగారెడ్డిగూడెం సబ్ రిజిస్ట్రార్‌లో చేరిన వేగవరం పంచాయితీ Limits వేగవరం గ్రామము ఆర్.ఎస్. నెం. 131, bearing D.No. 4-102, 331 చ॥గజముల ఖాళీ స్థలంకు హద్దులు.
తూర్పు: 46-0 Feet రోడ్డు.
పడమర: 43-0 Feet హటికల రాధాకృష్ణ యిల్లు.
ఉత్తరం: 68-0 Feet బండారు నాగరాజు యిల్లు.
దక్షిణం: 66-0 Feet గుళ్ళపల్లి మోజస్ చౌదరి.

యీ హద్దుల మధ్య గల 331 చ॥గజములు ఖాళీ స్థలం, అందలి గల నానావిధ ఫలవృక్షములతో సహా easement హక్కులతో సహా వేలం కావలెను.

DHR విలువ: రూ. 3,00,000/-
Amin విలువ: రూ. 6,62,000/-
JDR విలువ: NIL

ఎం.ఎస్.ఎస్.చక్రపాణి
అడ్వకేట్, కొవ్వూరు
కొవ్వూరు
ది.14-11-2023
సెల్: 9347626845